

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా..

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎండలు మండుతుండటంతో విద్యుత్ సిబ్బందికీ కరెంట్ కష్టాలు తప్పడం లేదు. లోడ్ ఎక్కువై ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడ కాలిపోతాయోమోనన్న భయంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అక్కన్నపేట మండలం కట్కూర్‌లో శుక్రవారం ట్యాంకర్ల ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్తింగ్ వైర్లకు నీళ్లు పోశారు.

సీపీఆర్‌పై శిక్షణ



సిద్దిపేట కోర్టులో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వినోద్‌బాబ్జి

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖ సహకారంతో శుక్రవారం కోర్టులో సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా లీగల్ సరీ్వసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి టి.రఘురాం ప్రారంభించారు. డాక్టర్ వినోద్ బాబ్జి, డాక్టర్ శ్రీకాంత్ గుండెపోటు వచ్చినవారికి సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. వారం క్రితం కోర్టు ఆవరణలో కోర్టు సిబ్బంది పద్మకు గుండెపోటు రావడంతో అక్కడే ఉన్న తోటి సిబ్బంది యోగేశ్వరీ, అనూష సీపీఆర్ చేసి కాపాడారు. దీంతో వారిని న్యాయమూర్తులు సన్మానించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మురళీమోహన్, స్వాతిరెడ్డి, మిలింద్‌కాంబ్లి, శ్రావణి, వైద్య సిబ్బంది, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



బొడ్రాయికి పూజలు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని దౌలాపూర్ గ్రామంలో శుక్రవారం అంగరంగ వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహించారు. గ్రామం నడిబొడ్డున ప్రతిష్ఠించిన నాభిశిలకు మహిళలు అభిషేకం చేశారు. బొడ్రాయి ప్రతిష్ఠకు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో పండితులు కేశవరెడ్డి, శ్రీనివాస్‌శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు కృష్ణ, సుధాకర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పుల్లయ్య, సంజీవరెడ్డి, ఉప్పల్‌రెడ్డి, సాయిలు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వివేక్‌వర్ధన్

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలను నడుపుతున్న శ్రీచైతన్య హైస్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వివేక్ వర్ధన్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని మహాశక్తినగర్‌లోగల శ్రీచైతన్య హైస్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ఎంఈఓ, డీఈఓల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పాఠశాలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘటన కార్యదర్శి లక్ష్మీపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదిత్య, పవన్, డిగ్రీ కళాశాల కార్యదర్శి పర్షరాం పాల్గొన్నారు.

వైభవంగా రంగనాయక స్వామి రథోత్సవం

జగదేవ్‌పూర్(గజ్వేల్): శ్రీ రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జగదేవ్‌పూర్‌లో స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. రథాన్ని పూలతో అలంకరించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంలోఉంచి వీధుల గుండా ఊరేగించారు. రథంలో ఊరేగుతూ వచ్చిన స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మంగళహారతులు ఇచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబం ఆందోళన

చేర్యాల(సిద్దిపేట): ద్విచక్ర వాహన విక్రయ సమయంలో ఇవ్వాల్సిన బీమా పత్రాలు ఇవ్వలేదంటూ పట్టణ కేంద్రంలోని ఓ ద్విచక్ర వాహన షోరూం ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన సందెల అశోక్ ఈనెల 11వ తేదీన పట్టణ కేంద్రంలోని షోరూంలో కొత్త స్కూటీ కొనుగోలు చేశాడు. అతడు శుక్రవారం ఉదయం వైద్యం కోసం సిద్దిపేట జిల్లా కేంద్రానికి వెళ్తుండగా దుద్దెడ క్రాసింగ్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. వాహనానికి ఇన్సూరెన్స్ లేదన్న విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్కూటీ కొనుగోలు చేసిన షోరూంకు వెళ్లి ఆందోళన చేశారు. షోరూం యజమాని వారి డిమాండ్లకు ఒప్పుకోవడంతో ఆందోళన విరమించినట్లు తెలిసింది.

ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిద్దాం

మెదక్ పార్లమెంట్ ఎన్నికల సమన్వయ కర్త శ్రీకాంత్‌రావు

గజ్వేల్‌రూరల్: మెదక్ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపిద్దామని మెదక్ పార్లమెంట్ ఎన్నికల సమన్వయ కర్త బండారు శ్రీకాంత్‌రావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జాలిగామలో శుక్రవారం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలం మధు గెలుపుకోసం కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేన్నారు. కార్యక్రమంలో తీగుల్ మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాచకొండ ప్రశాంత్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రవీందర్, మర్కుక్, కొండపాక మండలాల కిసాన్‌సెల్ అధ్యక్షులు శ్రవణ్‌రెడ్డి, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.



జాలిగామలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రావు

సంక్షేమ పథకాలు కాంగ్రెస్‌తోనే సాధ్యం



పార్టీలో చేరుతున్న యువకులు, మహిళలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టీపీసీసీ సెక్రటరీ గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామానికి చెందిన మహిళలు, యువకులు పార్టీలో చేరారు.

ములుగు(గజ్వేల్): కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సారెడ్డి కోరారు. ములుగు మండల బీఆర్ఎస్ పార్టీకి చెందిన జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీంతో పాటు పలువురు నాయకులు హైదరాబాద్‌లోని కొంపల్లిలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

దళారులను ఆశ్రయించొద్దు

మద్దూరు(హుస్నాబాద్): కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే రైతులు ధాన్యం విక్రయించాలని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని మద్దూరు మండల ఏవో రామకృష్ణ సూచించారు. మండల పరిధిలోని రేబర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమ్మడి మద్దూరు మండలంలో 22,084 ఎకరాల్లో వరి సాగు చేశారని తెలిపారు. ఉమ్మడి మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 14 కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జి చంద్రం, ఐలయ్య ఉన్నారు.

బీజేపీలో మాజీ సర్పంచ్‌లు చేరిక

అక్కన్నపేట(హుస్నాబాద్): పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన మాజీ సర్పంచులతోపాటు పలువురు సీనియర్ నాయకులు బీజేపీలో చేరారు. అక్కన్నపేట మండలంలోని దుబ్బతండా, మంచినీళ్లబండ, కేశనాయక్‌తండా, మైసమ్మవాగుతండా, నందారం, మల్‌చెరువుతండా గ్రామాల మాజీ సర్పంచులు మాలోతు రాజునాయక్, ఇటిక్యాల కవితకుమార్, భానోతు రవీందర్, సందబోయిన లావణ్యకుమార్, లింగాల ఎల్లయ్య, భూక్య మల్లేశ్ శుక్రవారం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబం జైలుకే..

బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందర్‌రావు



కోనాయిపల్లి వేంకటేశ్వరాలంలో పూజలు చేస్తున్న రఘునందన్‌రావు

నంగునూరు(సిద్దిపేట): లోక్‌సభ ఎన్నికల తర్వాత కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లడం ఖాయమని మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా కోనాయిపల్లి వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసి నంగునూరు మండలంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవితను బతుకమ్మ ఆడమంటే ఢిల్లీకి పోయి సారా, వైన్స్, బార్ దుకాణాలు పెట్టి తెలంగాణ ఇజ్జత్ తీసింది.. బిడ్డ తప్పు చేస్తే తండ్రిగా కేసీఆర్‌ది బాధ్యత కాదా? అని ప్రశ్నించారు. ఎన్నికలు ముగియగానే కేసీఆర్ సహా అందరూ జైలుకు వెళతారని, హరీశ్‌రావు ఏ పార్టీలోకి పోతాడో తర్వాత తెలుస్తుందన్నారు. 39 ఏళ్లుగా ఈ ప్రాంతాన్ని ఒకే కుటుంబం పాలిస్తోందని, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఎదురు తిరిగితే కేసులు పెడతారని ప్రజలు భయపడుతున్నారన్నారు. నాడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారు ఇప్పుడెక్కడున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూదొందే అని మండిపడ్డారు.

రెండు లక్షల రుణమాఫీ ఏది..?

అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి నాలుగు నెలలు గడిచినా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. లంకె బిందెలు లేవని చెప్పిన రేవంత్‌రెడ్డి రూ.4 వేల పింఛన్లు ఇవ్వకుండా నెలనెలా రూ.4 లక్షల జీతం ఎలా తీసుకుంటున్నాడో చెప్పాలన్నారు.

ఆ పార్టీలకు గుణపాఠం చెప్పాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్

కొండపాక(గజ్వేల్): ప్రజల సమస్యలు పట్టించుకోని బీఆర్ఎస్, బీజేపీలకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్ కోరారు. మండల పరిధిలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద మండల పార్టీ అధ్యక్షుడు వాసరి లింగారావు, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కొమ్ము మల్లికార్జునలతో కలిసి శుక్రవారం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను అమలు చేసిన విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి కుటుంబ పాలన సాగించిందన్నారు. బీజేపీ కులమతాల మధ్య చిచ్చు పెట్టేలా పని చేస్తోందని ఆరోపించారు.

బూర వ్యాఖ్యలను గమనించాలి

చేర్యాల(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాలకుగాను 17 గెలిపిస్తే హైదరాబాదును రెండో రాజధాని చేస్తామన్న బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ వ్యాఖ్యలను భువనగిరి ప్రజలు గమనించాలని కాంగ్రెస్ నాయకుడు నాగపురి కిరణ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ తెలంగాణకు గుండె కాయన్నారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో 50 శాతం హైదరాబాద్ నుంచి వస్తుందన్నారు. అలాంటి హైదరాబాద్‌ని దేశానికి రెండో రాజధాని చేస్తే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి అర్థం ఉండదన్నారు.

అండగా ఉంటాం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక మార్కెట్‌లో మహిళా రైతును ఓదారుస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: అకాల వర్షంతో రైతులకు నష్టం కలగడం బాధాకరమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం దుబ్బాక మార్కెట్ యార్డును సందర్శించారు. పలువురు మహిళా రైతులు తడిసిన ధాన్యాన్ని చూపిస్తు ఎమ్మెల్యే ముందు కన్నీరు పెట్టారు. చలించిన ఎమ్మెల్యే వారిని ఓదార్చారు. అధైర్యపడొద్దని తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని రైతులకు హామీనిచ్చారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

ములుగు(గజ్వేల్): చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. జిల్లా సరిహద్దు గ్రామమైన వంటిమామిడి రాజీవ్‌రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధారాలు లేకుండా నగదు, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులు, మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. రాత్రివేళ ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఏసీపీ ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు విరమణ సహజం

ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ సహజమని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి హైస్కూల్ ఆఫీస్ సబార్డినేట్ బాలపోశయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసిన సేవలు గుర్తుండిపోతాయన్నారు. అనంతరం బాలపోశయ్య దంపతులను ఘనంగా సన్మానించారు.

తెలంగాణ అండర్ 20 కెప్టెన్‌గా యశ్వంత్

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్ర ఫుట్ బాల్ అండర్ 20 జట్టు కెప్టెన్‌గా సిద్దిపేటకు చెందిన సాయి యశ్వంత్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన యశ్వంత్ యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ కనబర్చాడు. యశ్వంత్ నియామకంపై సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ కోచ్ అక్బర్ హర్షం వ్యక్తం చేశారు.

ధాన్యాన్ని త్వరగా తరలించాలి

ఆర్డీఓ రామ్మూర్తి



అక్కన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి

అక్కన్నపేట(హుస్నాబాద్): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఆర్డీఓ రామ్మూర్తి అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, చెక్‌పోస్ట్‌తోపాటు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చిన ధాన్యం వచ్చినట్లుగా తూకం వేసే వెంటనే తరలించాలన్నారు. ప్రతీ కొనుగోలు కేందంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. గ్రామాల్లోని లోకల్ ట్రాక్టర్ ద్వారా ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం అక్కన్నపేటలో పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను సందర్శించారు. ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సంజీవ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఇతర కులాలను బీసీ(ఏ)లో కలపొద్దు

జిల్లా నాయీబ్రాహ్మణ సేవాసంఘం మాజీ అధ్యక్షుడు యాద నరేందర్



సమావేశంలో పాల్గొన్న నాయీ బ్రాహ్మణ సేవాసంఘం సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీసీ(ఏ)లో ఇప్పటి వరకు ఉన్న కులాలు తప్ప కొత్త వాటిని కలపొద్దని జిల్లా నాయీ బ్రాహ్మణ సేవాసంఘం మాజీ అధ్యక్షుడు కొత్వాల్ యాద నరేందర్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ(ఏ) లో సీఎం కలుపుతామన్నారని, వారిని బీసీ-ఏలో కలపొద్దన్నారు. ఇప్పటికే అనేక కులాలు ఉన్నాయని, అన్నింటిలో ఈ కులాలు వెనుకబడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలంకల శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కొత్వాల్ కిషన్ అధికార ప్రతినిధి జాలిగామా విద్యాకర్, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆల్వాల స్వామి, పట్టణ అధ్యక్షుడు కొత్వాల్ చంద్రం, పట్టణ ప్రధాన కార్యదర్శి కొత్వాల్ కిషన్, కోశాధికారి ముత్యాల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



విజేతలతో గజ్వేల్ సీఐ సైదా తదితరులు

గజ్వేల్ సీఐ సైదా

గజ్వేల్‌రూరల్: సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం గజ్వేల్‌లో 3కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. సమాజంలో జరిగే ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉంటూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు 3కే రన్ విజేతలకు సీఐ సైదా, డాక్టర్ లింగం, బాలల సంరక్షణ సమితి జిల్లా సభ్యుడు దేశబోయిన నర్సింలు, పిరమిడ్ స్పిరచ్యువల్ సొసైటీ ఆఫ్ మూవ్‌మెంట్ ప్రతినిధి నర్సింహులు, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు గోపాల్, వినోద్, కరుణాకర్, స్వామి, అక్బర్, వెంకట్, విజయ్, సాయిబాబా, కరుణాకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

డీపీఓ దేవకీ దేవి



మాట్లాడుతున్న డీపీఓ దేవకీ దేవి

మిరుదొడ్డి(దుబ్బాక): మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీపీఓ దేవకీ దేవి కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. మిరుదొడ్డి ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పాలనాధికారులతో కలిసి వేసవిలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు ఎండలో పని చేయకుండా ఉదయం, సాయంత్రం వేళలో పనులు చేసేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కూలీలకు వడదెబ్బ తగలకుండా ముందస్తు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీఓ గణేష్, ఎంపీఓ జహీరొద్దీన్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అక్రమ వెంచర్లపై కొరడా**

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ, వెలికట్ట శివారుల్లో అనుమతి లేకుండా వెలిసిన వెంచర్లపై శుక్రవారం అధికారులు కొరడా ఝుళిపించారు. దుద్దెడ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా, వెలికట్ట శివారులోని వెంచర్లలో పాతిన హద్దు రాళ్లను అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు తొలగించారు. మండలంలో తక్కువ ధరకు వ్యవసాయ భూములు కొనుగోలు చేస్తూ అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

◆ **22 వరకు పాలిసెట్ దరఖాస్తు గడువు**

గజ్వేల్‌రూరల్: ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులకు నిర్వహించే పాలిసెట్-2024 ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వ తేదీ తుది గడువని గజ్వేల్ జీఎంఆర్ (ప్రభుత్వ ఆదర్శ గురుకుల) పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, పాలిటెక్నిక్ చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, మే 24న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. www. polycet. sbtet. telangana. gov. in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ **బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు**

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మండల పరిధిలోని కొడకండ్లలో శ్రీనివాస్ తన కిరాణా దుకాణంలో మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కుకునూర్‌పల్లి పోలీసులు దాడిచేసి 22.475 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. 87126 67445, 87126 67446, 87126 67447 నంబర్లకు తెలియజేయాలన్నారు.

◆ **రెడ్డి జేఏసీ పరామర్శ**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన రెడ్డి సంఘం జిల్లా యూత్ కార్యదర్శి సందీప్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాందో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని శుక్రవారం రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల సంఘం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ **ఎన్నికల డ్యూటీ**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అనుమాసు సంపత్‌రెడ్డికి తొలి విడత ఎన్నికలు జరుగుతున్న తమిళనాడులో శుక్రవారం విధులు నిర్వర్తించారు. తమిళనాడులోని కరూర్ జిల్లా అరవకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎన్నికల విధులు నిర్వహించారు.

◆ **ఆకట్టుకున్న కళాజాత**

వర్గల్(గజ్వేల్): సామాజిక రుగ్మతలు, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు గురువారం రాత్రి వర్గల్ మండలం అంబర్‌పేటలో పోలీసు కళాబృందం కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్‌ఐ శివకుమార్ మాట్లాడారు. జల్సాల కోసం ఆన్‌లైన్ లోన్లు తీసుకుని ఇబ్బందులు పడొద్దన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

◆ **ఇసుక డంపుల సీజ్**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను శుక్రవారం సీజ్ చేసి రెవెన్యు అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించిన ఇసుక డంప్‌లను గుర్తించారు. కాగా డంప్‌లు సీజ్ చేస్తున్న పోలీసులు సంబంధిత వ్యక్తులను పట్టుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నామమాత్రంగానే తనిఖీలు చేస్తున్నారని తోటపల్లి, గాగిల్లాపూర్ గ్రామస్తులు తెలిపారు.

◆ **పోలీసుల కవాతు**

ములుగు(గజ్వేల్): మండలంలోని కొత్తూరు గ్రామంలో శుక్రవారం రాత్రి కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు విషయంలో ఎవరైన బెదిరింపులకు పాల్పడితే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కవాతులో సీఐఎస్ఎఫ్ సీఐ వెంకట్రావు, ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

